TELANGANA ADDA

RNI: TGTEL/25/A0986

# తెలంగాణ అడ్డా

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యే మా ఆయుధం

PUBLISHED: KARIMNAGAR సంపుటి : 02 సంచిక : 48 గురువారం 03-09-2026 ఎడిటర్ :- గడ్డి నరేష్, పేజీలు : 04

## చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 348 మృతదేహాల వెలికితీత

- నేపాల్ జలప్రళయం.. 1,127కు పెరిగిన మృతుల సంఖ్య.. 4,858 మంది గల్లంతు!
- నేపాల్ ను అతలాకుతలం చేసిన ఫ్లాష్ ఫ్లడ్స్
- 6,541 మందిని సురక్షితంగా రక్షించిన రెస్క్యూ టీమ్స్



నేపాల్‌ను భయంకరమైన ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) అతలాకుతలం చేసిన సంగతి తెలిసిందే. ఈ జల ప్రళయం కారణంగా తీవ్ర ప్రాణనష్టం జరిగింది. నేపాల్ పోలీసు వర్గాలు వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం... వరదల దాటికి బలైన వారి సంఖ్య 1,127కు పెరగ్గా, మరో 4,858 మంది - మిగతా 2 లో

## విమానయాన సంస్థలకు జెలెన్‌స్కీ హెచ్చరిక.. ఉగ్రవాదులతో చర్చలు ఉండవన్న పుతిన్

- రష్యాపై పెద్ద స్థాయిలో డ్రోన్ దాడులు చేయబోతున్నామన్న జెలెన్‌స్కీ
- రష్యా గగనతలం పౌర విమానయానానికి సురక్షితం కాదని హెచ్చరిక
- ఉక్రెయిన్ వైఖరి ఉగ్రవాదుల తీరును తలపిస్తోందన్న పుతిన్



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరోసారి అత్యంత ఉద్రిక్త రూపం దాల్చింది. రష్యాపై మునుపెన్నడూ లేని రీతిలో అతిపెద్ద డ్రోన్ దాడులు - మిగతా 2 లో

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం



- ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు: పొంగులేటి
- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సామాన్యుల కష్టాలు తీర్చేందుకు నిరంతరం కృషి చేశామన్న పొంగులేటి
- రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి - మిగతా 2 లో

## "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"



- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్
- కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ - మిగతా 2 లో

# ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడితో భేటీ
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం
- రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం




ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి

# నేపాల్ వరద బాధితులకు అండగా సోనూ సూద్

- చిన్నారులను చూసి హృదయం ద్రవించిందంటూ భావోద్వేగం
- నేపాల్ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన నటుడు
- సహాయక శిబిరాల్లోని చిన్నారుల పరిస్థితి చూసి హృదయం ముక్కలైందని ఆవేదన
- ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి
- ఇది ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదన్న సోనూ సూద్
- మానవత్వంతో అందరూ స్పందించాలని పిలుపు






కరోనా సంక్షోభ సమయంలో వలస కార్మికులకు అండగా నిలిచి రియల్ హీరో అనిపించుకున్న నటుడు, సేవా తత్పరుడు సోనూ సూద్ మరోసారి తన విశాల హృదయాన్ని చాటుకున్నారు. పొరుగు దేశమైన నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న

## సావర్కర్‌కు ముస్లింలంటే ద్వేషం లేదు

కోర్టుకు తెలిపిన మనవడు



- సావర్కర్‌కు ముస్లింల పట్ల ద్వేషం లేదని కోర్టుకు చెప్పిన సాత్యకి
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో సావర్కర్‌ను ముస్లింల ద్వేషిగా చిత్రీకరించారని ఆరోపణ
- లండన్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సాత్యకి పరువునష్టం దావా

హిందుత్వ భావజాలవేత్త వినాయక్ దామోదర్ సావర్కర్‌కు ముస్లింలపై ఎన్నడూ ద్వేషం లేదని, పైగా వారి - మిగతా 2 లో

## భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి



- నేపాల్ ఆకస్మిక వరదల వల్ల ఇప్పటి వరకు 11 వందల మందికి పైగా మృతి
- పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము మూల్యం చెల్లించుకుంటున్నామన్న నేపాల్
- తమకు నష్టపరిహారం చెల్లించడం చట్టపరమైన బాధ్యత అని వ్యాఖ్య

నేపాల్‌ను ముంచెత్తిన ఘోర జలప్రళయం తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వేళ, ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక విజ్ఞప్తి చేసింది. - మిగతా 2 లో


## పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్



- నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్
- నరసరావుపేట జేఎన్టీయూకేలో నూతన హాస్టల్ భవనాల ప్రారంభం
- రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం
- గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో వసతి గృహాల నిర్మాణం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. - మిగతా 2 లో

## భర్తకు అన్నా కొణిదెల హృదయపూర్వక విషెస్



- పవన్ కల్యాణ్‌కు భార్య అన్నా కొణిదెల స్పెషల్ బర్త్‌డే విషెస్.. ఏమన్నారంటే?
- 55వ పుట్టినరోజు జరుపుకొంటున్న పవన్ కల్యాణ్
- పవన్ ఎంతోమంది హృదయాల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఎంతో మంది జీవితాలను ప్రభావితం చేశావన్న అన్నా
- భర్తతో దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న అన్నా

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నటుడు పవన్ కల్యాణ్ 55వ పుట్టినరోజు సందర్భంగా - మిగతా 2 లో

# గోదారమ్మకు సాష్టాంగ ప్రణామం

గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి వస్తున్న గోదావరి జలాలకు, స్వయంగా కాలువలోనే నిల్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న గోదారమ్మకు పుష్పాలు సమర్పించి, జలహారతి ఇచ్చి తన కృతజ్ఞతను చాటుకున్నారు. పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకున్న అనంతరం, ఉద్విగ్నభరిత వాతావరణంలో గోదావరి ప్రవాహానికి సాష్టాంగ నమస్కారం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. బుధవారం పాయకరావుపేటలో జరిగిన ఈ చారిత్రక కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

- కాలువలో నిల్చొని చంద్రబాబు జలహారతి
- పాయకరావుపేట వద్ద ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- కాలువలోకి దిగి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి
- నాలుగు జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు
- గోదావరి జలాలకు అడుగడుగునా నీరాజనాలు పలికిన ఉత్తరాంధ్ర ప్రజలు
- జలాలను ఉత్తరాంధ్రకు తెచ్చిన చంద్రబాబుకు రైతుల కృతజ్ఞతలు

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా పయనించి వచ్చిన



TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం



## పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి – ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## భర్తకు అన్నా కొణిదెల హృదయపూర్వక విషెస్

మొదటిపేజీ తరువాయి – ఆయన భార్య అన్నా కొణిదెల ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పవన్ ఎంతో మంది హృదయాల్లో, ఆలోచనల్లో, ప్రార్థనల్లో ఉన్నారని పేర్కొన్నారు. భర్తతో కలిసి దిగిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ఈ రోజు నిన్ను సెలబ్రేట్ చేసుకుంటున్నాం. నువ్వు ఎంతోమంది హృదయాల్లో, ఆలోచనల్లో, ప్రార్థనల్లో ఉన్నావు. ఎంతోమంది జీవితాలను నువ్వు ప్రభావితం చేశావనడానికి ఇది నిదర్శనం. ఇతరులకు ఎంతో ఇచ్చావు. పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ అన్నా పోస్టు చేశారు. అన్నా పంచుకున్న ఫొటోలో దంపతులిద్దరూ కిటికీ పక్కన కూర్చున్నారు. పవన్ పక్కనే అన్నా కూర్చొని ఆయన వైపు ఆప్యాయంగా చూస్తూ కనిపించారు. ఈ పోస్టు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. పవన్ కల్యాణ్ 1996లో 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత 'తొలిప్రేమ', 'తమ్ముడు', 'బద్రి', 'ఖుషి' వంటి వరుస విజయాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'జల్సా', 'గబ్బర్‌సింగ్', 'అత్తారింటికి దారేది', 'గోపాల గోపాల', 'భీమ్లా నాయక్' చిత్రాలతోనూ విజయాలు అందుకున్నారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. నటుడిగా ఆయనకు ప్రత్యేకమైన శైలి, మేనరిజమ్స్ ఉన్నాయి. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన ఆయనకు పుస్తకాలు చదవడం కూడా ఇష్టం.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం

మొదటిపేజీ తరువాయి – చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు. కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

## "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"

మొదటిపేజీ తరువాయి – వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

మొదటిపేజీ తరువాయి – పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు రాజ్ నాథ్ సింగ్ ను ముఖ్య అతిథిగా సీఎం ఆహ్వానించారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో భాగమైన డిఫెన్స్ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వద్ద ప్రతిపాదించిన డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని కోరారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం పునరుద్ధరణ అంశాన్ని రాజ్‌నాథ్ దృష్టికి తీసుకెళుతూ.. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని, అవసరమైతే మరో 750 ఎకరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అనంతరం పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రంలోని విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఆదిలాబాద్, వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని, కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రి గడ్డం వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ కుమార్ యాదవ్ తదితర నేతలు ఈ భేటీలలో పాల్గొన్నారు.

## భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

మొదటిపేజీ తరువాయి – ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న భారత్, చైనా, అమెరికా దేశాల నుంచి 'వాతావరణ మార్పుల నష్టపరిహారం' కోరుతూ నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ సంచలన ప్రకటన చేశారు. భోటేకోషి నదిలో సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. ఈ తీవ్ర విపత్తు వాతావరణ మార్పుల వల్ల హిమనీనదాలు (గ్లేసియర్లు) విరుచుకుపడటం వల్లే సంభవించిందని శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు తమ దేశం కారణం కాకపోయినా, అతిపెద్ద పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము తీవ్ర మూల్యం చెల్లించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు ఇచ్చే సాయం లేదా భిక్ష కాదని, బాధితులకు చెల్లించాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. తమ దౌత్య విధానాన్ని 'సాయం కోరడం' నుంచి 'న్యాయం, నష్టపరిహారం పొందే' దిశగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి గ్లోబల్ లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు...

## ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు

మొదటిపేజీ తరువాయి – ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

## హరీశ్‌రావునైనా క్షమిస్తానేమో కానీ.. ప్రశాంత్‌రెడ్డిని క్షమించను

మొదటిపేజీ తరువాయి – తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అవినీతి కారణంగానే ఆ రెండు పార్టీలు మిలాఖత్ అయ్యాయని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ మౌనంగా ఉందని ఆరోపించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ప్రసంగించారు. బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. పదేళ్లలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుందని కవిత విమర్శించారు. ఆ పార్టీ హయాంలో నాలుగు ఇళ్లు మాత్రమే బంగారమయ్యాయని ఎద్దేవా చేశారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్‌లో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు అందించలేకపోయారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. ప్రశాంత్‌రెడ్డి తనను తండ్రి నుంచి దూరం చేశారని, ఆయనకు తన ఉసురు తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్‌రావు, సంతోష్‌రావును క్షమించినా ప్రశాంత్ రెడ్డిని మాత్రం జీవితంలో క్షమించనని స్పష్టం చేశారు. ఆడబిడ్డ కష్టాల్లో ఉంటే పుట్టింటి వాళ్లే కుట్ర చేసి తరిమేశారంటూ కన్నీటిపర్యంతమయ్యారు. తాను ఏ తప్పూ చేయకపోయినా నాలుగేళ్లుగా ఈడీ, సీబీఐలతో వేధించి తీహార్ జైలులో పెట్టారని కవిత అన్నారు. తాను నిర్దోషినని సుప్రీంకోర్టే చెప్పిందని, దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక సీబీఐ అధికారిపైనే విచారణకు ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రజల జీవితాల్లో మార్పు కోసమే పంతం పట్టి పార్టీ పెట్టానని, పదవుల కోసం కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ప్రతిపక్షంగా బీఆర్ఎస్ నిద్రపోతోందని విమర్శించారు.

## నేపాల్ వరద బాధితులకు అండగా సోనూ సూద్

మొదటిపేజీ తరువాయి ఆకస్మిక వరద బాధితులను ఆదుకునేందుకు ఆయన నేరుగా రంగంలోకి దిగారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయి, లక్షలాది మంది నిరాశ్రయులైన వేళ, వారికి అండగా నిలిచేందుకు నిత్యావసర సరుకులతో కూడిన సహాయ సామగ్రితో నేపాల్ రాజధాని ఖాట్మండు చేరుకున్నారు. అక్కడి సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటూ బాధితులకు ధైర్యం చెబుతున్నారు. ఈ సందర్భంగా 'ఎన్డీటీవీ'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సోనూ సూద్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సహాయక శిబిరాల్లోని పరిస్థితులు, ముఖ్యంగా చిన్నారుల దుస్థితి చూసి తన హృదయం ముక్కలైందని ఆవేదన వ్యక్తం చేశారు. "వారు మన సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. సహాయక శిబిరాల్లో ఎందరో చిన్నారులు తమ కుటుంబాలతో ఉన్నారు. కానీ, వారి తల్లిదండ్రులు కనిపించడం లేదు. వారిని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ప్రకృతి విపత్తు ముందు మనమంతా నిస్సహాయులం అనిపిస్తోంది" అని ఆయన అన్నారు. ఒక సహాయక శిబిరంలో తనను కదిలించిన సంఘటనను సోనూ సూద్ పంచుకున్నారు. తలదాచుకుంటున్న ఒక ప్రదేశానికి వెళ్లాను. అక్కడ క్రిస్టినా అనే 8-9 ఏళ్ల బాలికను కలిశాను. తన తమ్ముడితో ఉన్న ఆ చిన్నారి ముఖంలో చిరునవ్వు చెరగలేదు. 'అంతా సర్దుకుంటుంది' అని నాతో చెప్పింది. నేను అక్కడి నుంచి తిరిగి నా కారు ఎక్కేంత వరకు ఆ పాప నన్నే అనుసరించింది. ఆ చిన్నారిని దత్తత తీసుకోవాలని, తన కోసం ఏదైనా చేయాలని అనిపించింది. కానీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. అందుకే మనలో ప్రతి ఒక్కరం మనకు తోచినంత సహాయం చేయడం చాలా ముఖ్యం. అది ఎన్నో మార్పులను తీసుకొస్తుంది" అని వివరించారు. ఈ విపత్కర సమయంలో ప్రజలు ఎలా స్పందించాలని అడగ్గా.. "మనం సురక్షితమైన ప్రదేశాల్లో ఉన్నందుకు అదృష్టవంతులం. మీరు ఎంత బిజీగా ఉన్నా, కాస్త సమయం కేటాయించి, సర్వం కోల్పోయిన ఈ కుటుంబాల గురించి ఆలోచించండి. వారికి కొంత విరాళం పంపండి, మీకు సాధ్యమైనది ఏదైనా పంపండి. కేవలం నేపాల్ అనే కాదు, ఎక్కడ విపత్తు వచ్చినా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఇది కేవలం ప్రభుత్వాలు, మంత్రుల బాధ్యత అని అనుకోకూడదు. ఒక మనిషిగా, ఒక భారతీయుడిగా మంచి చేయడం మనందరి కర్తవ్యం" అని సోనూ సూద్ పిలుపునిచ్చారు. నేపాల్ చేరుకున్న తర్వాత స్థానికులతో ఉన్న చిత్రాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ.. "వారు తమ ఇళ్లను, కుటుంబాలను, బాల్యాన్ని కోల్పోయారు.

## గోదారమ్మకు సాష్టాంగ ప్రణామం









మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, నారాయణ, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, ఎంపీలు చింతకాయల విజయ్, సీఎం రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయ కోలాటంతో కళాకారులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. రూ.4,192 కోట్ల వ్యయంతో నిర్మించిన పోలవరం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన ఈ నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక, తాగు, సాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఈ నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనివల్ల పుష్కర, ఏలేరు, పంపా, తాండవ, వరహా, మామిడిగెడ్డ ఆయకట్టు కింద ఉన్న మొత్తం 46,620 ఎకరాలు స్థిరీకరణ కానున్నాయి. గోదావరి జలాలు తమ ప్రాంతానికి రావడంతో స్థానిక ప్రజలు, రైతులు ఆనందోత్సాహాలతో పులకించిపోయారు. కాలువకు ఇరువైపులా నిల్చుని ప్రవాహానికి అడుగడుగునా పుష్పాంజలి ఘటిస్తూ, హారతులు పడుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు. తమ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతు సోదరులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి అక్కడున్న ప్రజాప్రతినిధులు, అధికారులందరినీ స్వయంగా పిలిచి శిలాఫలకం వద్ద గ్రూప్ ఫోటోలు దిగారు.

## సావర్కర్‌కు ముస్లింలంటే ద్వేషం లేదు

మొదటిపేజీ తరువాయి – పురోభివృద్ధికి తన రచనల్లో దిశానిర్దేశం చేశారని ఆయన మనవడు సాత్యకి సావర్కర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను తీవ్ర ముస్లిం ద్వేషిగా చిత్రీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీపై సాత్యకి దాఖలు చేసిన పరువునష్టం దావాకు సంబంధించి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సాత్యకిని అడ్వకేట్ మిలింద్ పవార్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. 2023లో లండన్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "సావర్కర్ తన ఐదారుగురు స్నేహితులతో కలిసి ఒక ముస్లిం యువకుడిపై దాడి చేసి ఆనందం పొందానని తన పుస్తకంలో రాసుకున్నారు" అని అన్నట్లు సాత్యకి గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను ఒక మూకదాడికి పాల్పడే వ్యక్తిగా చూపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ మాటల వల్ల సావర్కర్‌ను తీవ్ర ముస్లిం వ్యతిరేకిగా చిత్రీకరించారు. కానీ ఆయనెప్పుడూ ముస్లింలను ద్వేషించలేదు. తన రచనల్లో వారి అభివృద్ధికి మార్గాలు సూచించారు" అని సాత్యకి కోర్టుకు వివరించారు. రాహుల్ గాంధీ పేర్కొన్నట్లుగా ముస్లిం యువకుడిపై దాడి జరిగిన ఘటన సావర్కర్ రాసిన ఏ పుస్తకంలోనూ లేదని ఫిర్యాదుదారు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోంది.

## విమానయాన సంస్థలకు జెలెన్‌స్కీ హెచ్చరిక.. ఉగ్రవాదులతో చర్చలు ఉండవన్న పుతిన్

మొదటిపేజీ తరువాయి – చేయడానికి సిద్ధమైనట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఏ క్షణంలోనైనా ఈ దాడులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున రష్యా గగనతలం పౌర విమానయానానికి ఎంతమాత్రం సురక్షితం కాదని, మాస్కోలోని విమానాశ్రయాలు కూడా తమ లక్ష్యాలలో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. పౌర విమానాలు తమ టార్గెట్ కాదనే ఉద్దేశంతోనే ముందస్తుగా ఈ బహిరంగ హెచ్చరిక జారీ చేశామని, అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విదేశీ ప్రభుత్వాలు ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించి ఆ ప్రాంతంలో ప్రయాణాలను తక్షణమే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. రష్యా స్వయంగా ప్రారంభించిన యుద్ధం వల్లే నేడు ఆ దేశానికి ఈ దుస్థితి ఎదురైందని ఆయన వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ చేసిన ఈ బహిరంగ హెచ్చరికలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉక్రెయిన్ వైఖరి ఉగ్రవాదుల తీరును తలపిస్తోందని ఆరోపించారు. అంతర్జాతీయంగా తమపై ఎంత ఒత్తిడి వచ్చినా, ఉగ్రవాద తరహా చర్యలకు పాల్పడుతున్నవారితో ఎలాంటి చర్చలు జరిపే ప్రసక్తే లేదని పుతిన్ తెగేసి చెప్పారు. ఈ పరిణామాల మధ్యనే మంగళవారం రాత్రి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా జరిపిన విధ్వంసకర దాడుల్లో 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు, రష్యా సైన్యంలో చేరిన 51 మంది భారతీయులు ఈ యుద్ధంలో మృతి చెందినట్లు వెలువడిన వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

## చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 348 మృతదేహాల వెలికితీత

**గల్లంతై ఆచూకీ లేకుండా పోయారు.**



మొదటిపేజీ తరువాయి – **బాధిత ప్రాంతాల్లో పరిస్థితి – సహాయక చర్యల వివరాలు:** చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 348 మృతదేహాలను వెలికితీయగా, నవల్‌పరాసి ఈస్ట్‌లో 217, నవల్‌పరాసి వెస్ట్‌లో 190, నువాకోట్‌లో 155 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఇతర జిల్లాలైన ధాడింగ్, గోర్ఖా, రసువా, తనాహులలోనూ భారీగా ప్రాణనష్టం సంభవించింది. భారీ ఎత్తున సహాయక చర్యలు: బాధితుల కోసం సుమారు 7,912 మంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దించారు. ఇప్పటివరకు వివిధ వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 6,541 మందిని రెస్క్యూ టీమ్‌లు సురక్షితంగా రక్షించాయి. భారత్, చైనా నిపుణుల భాగస్వామ్యం: భోటే కోషి నది పొంగిపొర్లడంతో రసువా వద్ద ఉన్న కీలకమైన జలవిద్యుత్ ప్రాజెక్టులు, భూగర్భ టన్నెళ్లలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు నేపాల్ ఆర్మీతో పాటు భారత్, చైనాలకు చెందిన టన్నెల్ రెస్క్యూ నిపుణులు రంగంలోకి దిగారు. అస్తిత్వ గుర్తింపు, డీఎన్ఏ నమూనాలు: ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాల్లో కేవలం 95 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులు గుర్తించి తీసుకెళ్లారని నేపాల్ ప్రధాని బాలెన్ షా తెలిపారు. గుర్తు పట్టలేని విధంగా ఉన్న శవాలకు డీఎన్ఏ నమూనాలు సేకరించి భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం
గురువారం 03-09-2026

# భార్యను కత్తితో పొడిచి దారుణ హత్య

### అడ్డువచ్చిన అత్తపైనా విచక్షణారహితంగా దాడి.. పరిస్థితి విషమం

**ఎల్లారెడ్డిపేట తెలంగాణ అడ్డా ప్రతినిధి, సెప్టెంబర్ 2:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో బుధవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త పల్లపు సురేష్ తన భార్య పల్లపు జ్యోతి (రజిత)పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చినట్లు సమాచారం. భార్య గొంతు, కడుపు, చేతులపై కత్తితో తీవ్రంగా దాడి చేయడంతో జ్యోతి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆమె అత్త గండికోట ఎల్లవ్వపై కూడా సురేష్ కత్తితో దాడి చేసినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన ఎల్లవ్వను చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పదిర గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించే చర్యలు చేపట్టారు. ఘటనకు కుటుంబ కలహాలే కారణమా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కరీంనగర్ జిల్లాలో తప్పిన ఘోర బస్సు ప్రమాదం.. వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** కరీంనగర్ జిల్లాలో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ శివారులో అదుపుతప్పి వ్యవసాయ బావిపైకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణికులు ఉన్న సమయంలో ఈ ఘటన జరగడంతో ఒక్కసారిగా భారీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో కొద్దిమంది ప్రయాణికులకు మాత్రమే స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పార్టీ పటిష్టత కోసం అధిష్టానం చేపడుతున్న పలు కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని, ఇవి క్షేత్రస్థాయి కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతున్నాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో పార్టీ ఆదేశానుసారంగా స్థానికంగా నిర్వహిస్తున్న వివిధ ప్రజాచైతన్య కార్యక్రమాలు, సంక్షేమ ప్రచార విధులను ఈ సందర్భంగా ఆయన ఖర్గేకు వివరించారు. పార్టీ బలోపేతానికి భవిష్యత్తులోనూ మరింత అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.

# వీర్ణపల్లి లో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



**తెలంగాణ అడ్డా వీర్నపల్లి ప్రతినిధి:** వీర్నపల్లిమండల కేంద్రం లో రాజన్న రాజ్య స్థాపనే ధ్యేయంగా, ప్రజా సంక్షేమమే ఊపిరిగా బతికిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వర్ధంతి వేడుకలు వీర్నపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్యా సంతోష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు భూక్యా సంతోష్ నాయక్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి లేదా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని కొనియాడారు. ఆయన పరిపాలన తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిందని, ప్రజా హృదయ విజేతగా వైఎస్సార్ ఎప్పటికీ నిలిచిపోతారని అన్నారు. ఈ క్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు . ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనారు

# తెలంగాణ జలసిరి: 'ఎల్ నినో' నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలి

### మండల పరిషత్ అధికారి శ్రీమతి బాజోజి శ్రీలేఖ.



**తెలంగాణ అడ్డా వీర్నపల్లి ప్రతినిధి:** వీర్నపల్లి మండల వ్యాప్తంగా రాబోయే రోజుల్లో నీటి ఎద్దడిని నివారించడానికి మరియు రైతులను ఆదుకోవడానికి 'తెలంగాణ జలసిరి' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నీటి సంరక్షణ పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO) శ్రీమతి బాజోజి శ్రీలేఖ గారు ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న **VB-G RAM G** (వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ – గ్రామీణ్) పథకం కింద ప్రత్యేకంగా రూపొందించిన 'ఎల్ నినో' కార్యాచరణ ప్రణాళికపై మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీమతి బాజోజి శ్రీలేఖ గారు మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ఎంతో కీలకమన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో వివిధ రకాల నీటి సంరక్షణ పనులైన మ్యాజిక్ ఇంకుడు గుంతలు (వ్యక్తిగత గృహాల వద్ద), కమ్యూనిటీ ఇంకుడు గుంతలు (బహిరంగ ప్రదేశాల్లో), బోర్‌వెల్ రీఛార్జ్ పిట్లు (ఎండిపోతున్న బోరు బావుల పునరుద్ధరణకు), ఫారం పాండ్లు (రైతుల పొలాల్లో పంట సంరక్షణ కొరకు సేద్యపు కుంటలు) మొదలైన పనులను వేగంగా పూర్తి చేసి, ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ పనులు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి, సాగునీటి కొరతను తీర్చడమే కాకుండా, రైతులకు ఎంతగానో మేలు చేకూరుస్తాయని ఆమె తెలిపారు.అలాగే ప్రతి గ్రామంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (ఎ+ప్లా) అనేది గ్రామ పంచాయతీ యొక్క వాస్తవ అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, ఇప్పటికే ఉన్న ఆస్తులు, మౌలిక వసతులు మరియు అభివృద్ధి లోటుపాట్లను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను రూపొందించే సమగ్ర ప్రణాళిక కొరకు గ్రామ సభలు నిర్వహించుటకు ఆదేశించడం జరిగినది. ఈ సమావేశంలో పాల్గొన్న మండల పంచాయితీ అధికారి (పీూా) శ్రీ బీరయ్య గారు మరియు అదనపు కార్యక్రమ అధికారి మారోజు శ్రీహరి గారు మాట్లాడుతూ, సాంకేతిక సహాయకులు పంచాయతీ కార్యదర్శులు మరియు క్షేత్ర సహాయకులు సమన్వయంతో ఈ పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# రూ.6.97 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### 22 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం చేతుల మీదుగా అందజేత

**బోయినిపల్లి తెలంగాణ అడ్డా ప్రతినిధి:** బోయినిపల్లి మండలానికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఫీ) కింద మంజూరైన రూ.6,97,500 విలువైన ఆర్థిక సహాయ చెక్కులను చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం బుధవారం గంగాధర క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. బోయినిపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం ఎంతో భరోసానిస్తోందని ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం అన్నారు. ముఖ్యంగా అనారోగ్యం, వైద్య చికిత్స వంటి అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న



కుటుంబాలకు ఈ సహాయం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే సత్యంకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల



కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొమ్మనబోయిన సుధీన్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గా రెడ్డి, రమణ రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మాడిశెట్టి మునీందర్, తిరుపతి రెడ్డి, పురుషోత్తం రెడ్డి, పులి లక్ష్మీపతి గౌడ్, సుదర్శన్, దేవయ్య, అంజయ్య, ఉపేందర్, చంద్రయ్య, రజనీకాంత్, ప్రవీణ్, జలేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ భారీ నిరసన

### పాల్గొన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో దాదాపు మూడు వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, నాలుగు వందల ఇరవై హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా 'నాలుగు వందల ఇరవై హామీలు -- నాలుగు వందల ఇరవై ఫీట్లు' అనే భారీ ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన తెలిపారు. అనంతరం 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను ప్రజలకు పంపిణీ చేస్తూ ప్రభుత్వం అమలు చేయని హామీలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు దేవాలయాల్లో దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలకు గ్యారెంటీ కార్డులు అందజేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి నేడు దాదాపు వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు



చేయలేదని విమర్శించారు. వచ్చే నెల.. వంద రోజులు అంటూ ప్రజలను నమ్మించి ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. మహిళలకు నెలకు రెండు వేల ఐదు వందల రూపాయల ఆర్థిక సాయం, తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, రైతులకు రైతు భరోసా, రెండు లక్షల రుణమాఫీ, వడ్లకు క్వింటాలుకు ఐదు వందల రూపాయల బోనస్, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్న కౌశిక్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నియోజకవర్గవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్, వాల బాలకిషన్ రావు, పోల్నేని సత్యనారాయణ రావు, నైనేని తిరుపతిరావు, పింగిలి రమేష్, వీణవంక మండలం నుంచి ముసిపట్ల తిరుపతి రెడ్డి, నీల కుమారస్వామి, దాసరపు రాధాకృష్ణ, కాసర్ల సుధాకర్, జక్కు నారాయణ, ముత్యాల శంకర్, నాగిడి సంజీవ రెడ్డి, అడిగిప్పుల సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ఇల్లందకుంట మండలం నుంచి సరిగొమ్ముల వెంకటేష్, కందాల కొమురెల్లి, మర్రి శ్రీనివాస్ రెడ్డి, దంసాని కుమార్, మోటపోతుల అలయ్య, కంది దిలీప్ రెడ్డి, తిప్పారవేని మొగిలి, మసూద్ అహ్మద్, మట్టా వాసుదేవ రెడ్డి, కటంగూరి రాంస్వరన్ రెడ్డి, బూస అశోక్, తేద్ల ఒదెలు పాల్గొన్నారు. కమలాపూర్ మండలం నుంచి నైనేని తిరుపతి రావు, పేరాల సంపత్ రావు, యర్రం ఇంద్రసేన రెడ్డి, మరపెల్లి నవీన్ కుమార్, లండిగె లక్ష్మణ్ రావు, తక్కళ్లపల్లి సత్యనారాయణ రావు, ఎమ్మడిశెట్టి శ్రీనివాస్, పెండ్యాల రవీందర్ రెడ్డి, పోరండ్ల కృష్ణ ప్రసాద్, ఎర్రబెల్లి సంపత్ రావు, కట్కూరి తిరుపతి రెడ్డి, మౌటం అశోక్, బాలసాని కుమారస్వామి, పోరండ్ల రమేష్, పుల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. హుజూరాబాద్ మండలం నుంచి ఏడవెల్లి కొండల్ రెడ్డి, పోల్సాని రామారావు, సంగెం ఇలయ్య, ఎరుమల్ల సురేందర్ రెడ్డి, గుడూరి ప్రతాప్ రెడ్డి, తాటికొండ పుల్లాచారి, కట్కూరి మల్లారెడ్డి, మంతెన శ్రీనివాస్, పోరెడ్డి దయాకర్ రెడ్డి, దాసరి రమణారెడ్డి, అనుమండ్ల శ్యామ్‌సుందర్ రెడ్డి, బండి రమేష్, పాకాల లక్ష్మారెడ్డి, మండ సతీష్, పంజాల సదానందం, జైహింద్ రెడ్డి పాల్గొన్నారు. జమ్మికుంట మండలం నుంచి దొడ్డె మమత, పోల్సాని మనోహర్ రావు, పోల్సాని తిరుపతి రావు, పమ్మిడి లింగారావు, మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, కడవెరుగు మోహన్, పోల్సాని సమ్మారావు, కనపర్తి లింగారావు, మడికొండ సురేందర్ రావు, తోట లక్ష్మణ్, బి. సమ్మారావు, చిల్మల రామస్వామి, చందుపట్ల కృష్ణారెడ్డి, రాచపల్లి రాజయ్య పాల్గొన్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ నుంచి గందె శ్రీనివాస్, వర్ధినేని రవీందర్ రావు, కొలిపాక శ్రీనివాస్, ప్రతాప తిరుమల్ రెడ్డి, పోరెడ్డి శాంతన్ రెడ్డి, కేసిరెడ్డి లావణ్య నరసింహ రెడ్డి, అపరాజ ముత్యం రాజు, తల్లపల్లి శ్రీనివాస్, ముక్క రమేష్, ములుగు పూర్ణచందర్, ఆర్.కే. రమేష్, బాబా షఫియొద్దీన్, సమ్మారావు బోర్నపల్లి, మెరుగు కొండల్ రెడ్డి, ఎం.డి. అంజదుల్లా ఖాన్ పాల్గొన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ నుంచి ములుగు ప్రశాంత్ కుమార్, తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, ఎం.డి. ముంతాజ్ అలీ, పొదేటి రామస్వామి, పొనగంటి సంపత్, బచ్చు శివశంకర్, పొనగంటి మల్లయ్య, పొనగంటి రాము, బొద్దుల రవీందర్, జుగురు సదానందం, దయ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో 420 అడుగుల ఫ్లెక్సీతో బీఆర్ఎస్ వినూత్న నిరసన

### కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరశంఖం

### హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం: చల్మెడ లక్ష్మీనరసింహారావు

### వేములవాడలో హోరెత్తిన బీఆర్ఎస్ నిరసన ర్యాలీ

**తెలంగాణ అడ్డా వేములవాడ 2అ౬ సెప్టెంబర్:** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన కేవలం వైఫల్యాలు, మోసాలతోనే నిండిపోయిందని ఆరోపిస్తూ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోరుట్ల బస్ స్టాండ్ చౌరస్తా నుండి తెలంగాణ తల్లి విగ్రహం వరకు బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని 420 అడుగుల ఫ్లెక్సీతో నిరసన ప్రదర్శన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కోరుట్ల బస్టాండ్ చౌరస్తా పరిసరాలను హోరెత్తించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఎన్నికల వేళ ప్రజలకు 420కి పైగా మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, వంద రోజుల్లో నెరవేరుస్తామన్న వాగ్దానాలు 1000 రోజులు గడుస్తున్నా అమలకు నోచుకోలేదని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాలను ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని, ఆ మోసపూరిత వైఖరిని ఎండగట్టడానికే ఈ 420 అడుగుల ఫ్లెక్సీతో వినూత్నంగా ర్యాలీ చేపట్టామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆరు గ్యారెంటీలతో పాటు ఇచ్చిన అన్ని హామీలను తక్షణమే నెరవేర్చాలని, లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పోరాటాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్లా జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిలతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# బీసీ సంక్షేమ శాఖపై సమగ్ర సమీక్ష.. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి, వసతుల కల్పనకు అధికారుల ఆదేశాలు



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ పరంగా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని సమీక్షించి, పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కుట్టు మిషన్ల పథకానికి ఇప్పటివరకు లక్షా ఎణ్బది వేల నూట డెబ్బై (1,80,170) దరఖాస్తులు అందగా, సెప్టెంబర్ పదిహేను వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకానికి సంబంధించి సెప్టెంబర్ ఏడు లోపు ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను పూర్తిగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే బీసీ కుల సంఘాల కార్పొరేషన్ల చైర్మన్లకు అవసరమైన కార్యాలయాలు, మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మూడు వందల ఇరవై ఏడు మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలలలో మౌలిక సదుపాయాలు, సొంత భవనాల ఏర్పాటు మరియు స్థల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు నలుగురు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. హైకోర్టు స్టే ఎత్తివేసిన నేపథ్యంలో కల్యాణ లక్ష్మి పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, బీసీ స్టడీ సర్కిళ్ల ఆధునీకీకరణ తదితర అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు. ప్రతి నియోజకవర్గంలో మోడర్న్ దోబీఘాట్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి దశలో హుస్నాబాద్, హుజురాబాద్, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో వీటిని ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అందించే ప్రతి పథకం అర్హులైన నిజమైన లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని అధికారులు సూచించారు.

తెలంగాణ అడ్డా
RNI: TGTEL/25/A0986
గురువారం 03-09-2026

# కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి.. మహానేత సేవలను కొనియాడిన ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం




**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. సెప్టెంబర్ 2, 2026 నాడు నిర్వహించిన ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి తదితరులతో కలిసి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలిచారని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత వంటి ప్రతి రంగంలోనూ ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వందవఅ ఎనిమిది (108) సేవలు, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలు ఆయన హయాంలోనే ప్రవేశపెట్టారన్నారు. దేశంలో సంక్షేమం అంటే వెంటనే గుర్తుకొచ్చే ఏకైక పేరు వైఎస్ఆర్ అని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో వైఎస్ఆర్ పాత్ర మరువలేనిదని, ఆనాడు ఆయన నిర్మించిన ప్రాజెక్టులు, కాలువల వల్లే నేడు జిల్లాలో వ్యవసాయం సుభిక్షంగా ఉందన్నారు. శాతవాహన యూనివర్సిటీతో పాటు కొండగట్టు, మంథనిలో జేఎన్టీయూ, కోరుట్లలో వెటర్నరీ యూనివర్సిటీ వంటివి ఆయన హయాంలోనే ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. 2009లో హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన మరణించడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్నదే వైఎస్ఆర్ ఆశయమని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఆ ఆశయ సాధన కోసం కృషి చేసి ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడుపు మోహన్, బానోతు శ్రావణ్ నాయక్, వరాల నర్సింగం, పర్వత మల్లేశం, అన్నమనేని నర్సింగారావు, వెన్న రజిత రెడ్డి, అహమ్మద్ అలీ, విక్టర్, వంగల విద్యాసాగర్, కుంభాల రాజకుమార్, మాదాసు శ్రీనివాస్, గంగుల దిలీప్, మూల కృష్ణారెడ్డి, కర్రె పావని, ఫజల్, హాజీ, వసీం, ఇమ్రాన్ గని, సుంకే రాజు, దాసరి సందీప్, తోట అంజయ్య, కుర్ర పోచయ్య, మల్లారెడ్డి, ఫహద్, స్వప్న శ్రీ, మాలోతు మహాలక్ష్మి, పెంట శేఖర్, రాచర్ల పద్మ, సిరిపురం నాగప్రసాద్, సత్తినేని శ్రీకాంత్, కాశిపాక రాకేష్, శిల్పా, కూస రవీందర్, సుంకరి గణపతి, సుధాకర్ నాయక్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళల ఆర్థిక సాధికారతకు పెద్దపీట.. రంగారెడ్డి జిల్లాలో రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయం పంపిణీ చేసిన మంత్రి మహ్మద్ అజహరుద్దీన్




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** మైనారిటీ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మొహమ్మద్ ఒబేదుల్లా కోత్వాల్‌తో కలిసి మైనారిటీ లబ్ధిదారులకు ఆర్థిక సాయం, జీవనోపాధి ప్రోత్సాహకాలను ఆయన పంపిణీ చేశారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద రెండు వందల డెబ్బై ఎనిమిది మంది మైనారిటీ వితంతు మహిళలకు ఒక్కొక్కరికి యాభై వేల రూపాయల చొప్పున మంత్రి చెక్కులను అందజేశారు. ఈ ఆర్థిక సాయం మహిళలు, వారి కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు ఆర్థికంగా బలోపేతం కావడానికి దోహదపడుతుందని తెలిపారు. అలాగే మైనారిటీ కమ్యూనిటీకి తుర్క కాశా పునరావాసం పథకం కింద పదమూడు మంది తుర్క కాశా ముస్లిం కమ్యూనిటీ సభ్యులకు ఒక్కొక్కటి అరపై వేల రూపాయల విలువైన జనరేటర్, టూల్ కిట్లను పంపిణీ చేశారు. వీటి ద్వారా వారు స్వయం ఉపాధి పొందడంతో పాటు తమ జీవనోపాధిని మరింత మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విస్తృతమైన పారిశ్రామిక ప్రాంతాలు ఉండటం వల్ల రంగారెడ్డి జిల్లా దేశంలోని అత్యంత సంపన్న జిల్లాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ పనిలో ఎంతో సమర్థులని, వారికి బలమైన వృత్తిపరమైన విలువలు ఉంటాయని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనారిటీ మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మంత్రి తెలిపారు. మదీనా బస్సు అగ్నిప్రమాద ఘటన జరిగిన వెంటనే బాధిత కుటుంబాలకు పరిహారం అందించేందుకు ముఖ్యమంత్రి నిమిషాల వ్యవధిలోనే నిర్ణయం తీసుకోవడం మైనారిటీల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే హజ్ ఏర్పాట్ల పనుల కోసం ఏడు కోట్ల రూపాయలు మంజూరు చేయడం ప్రభుత్వ నిబద్ధతను చాటుతోందన్నారు. కుట్టు మిషన్లతో తనకు చిన్ననాటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని మంత్రి ఈ సందర్భంగా తన వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకున్నారు. తాను టెస్ట్ ప్లేయర్‌నని, నిధుల కోసం నాయకులు కోరిన డిమాండ్ల విషయంలో కూడా తాను సెంచరీ కొడతానని సరదాగా వ్యాఖ్యానించారు. యువత, ముఖ్యంగా పాతబస్తీలోని యువతకు కమ్యూనిటీ నాయకులు సరైన మార్గదర్శనం చేసి విద్య, ఉపాధి రంగాల వైపు ప్రోత్సహించాలని కోరారు. తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మొహమ్మద్ ఒబేదుల్లా కోత్వాల్ మాట్లాడుతూ, మైనారిటీ కమ్యూనిటీ సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ ఇస్తున్న సహకారాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్మయి, రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, కార్పొరేషన్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# 420 హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలి

# బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్




బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి సూచనలకు అనుగుణంగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ గారి, బీఆర్ఎస్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ తన్నీరు హరీశ్ రావు గారి ఆదేశాల మేరకు, పటాన్‌చెరు ఎమ్మెల్యే శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారి నేతృత్వంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వారం రోజుల పోరుబాటలో భాగంగా పటాన్‌చెరులో తొలి రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. 100 రోజుల్లో హామీల అమలు చేస్తామన్నారు.. 1000 రోజులు దాటినా హామీలపై స్పష్టత లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను గుర్తు చేస్తూ, పటాన్‌చెరు పట్టణంలోని ఎంజీ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు 420 హామీల ఫ్లెక్సీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలను ప్రజలకు వివరిస్తూ బాకీ హామీల కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ ఆదర్శ్ రెడ్డి గారితో కలిసి బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో 420 హామీలతో ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి 1000 రోజులు దాటినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. 1000 రోజులు దాటినా హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేదలు, సామాన్య ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్‌లో ప్రజా సమస్యలపై, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తుందని మాద్రి పృథ్వీరాజ్ తెలిపారు. "ప్రజల తరపున ప్రశ్నిస్తాం.. ప్రజల కోసం పోరాడతాం. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు, వీ= యువసేన సభ్యులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. 420 హామీలు అమలు చేయాలి.. ప్రజలకు సమాధానం చెప్పాలి!.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి అరుదైన ఘనత.. చెస్ ర్యాపిడ్ ఫార్మాట్‌లో అంతర్జాతీయ ఫీడే రేటింగ్ సాధించిన కే. స్నితిక్ రెడ్డి




**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** విద్యార్థులకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇవి ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా దైనందిన కార్యకలాపాలను ఎంతో ఉత్సాహంగా చేయడానికి దోహదపడతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థి చెస్‌లో అంతర్జాతీయ ఫీడే రేంకింగ్ సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వివిధ స్థాయిలలో విజయాలను నమోదు చేయడానికి సహకరిస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చెస్ క్రీడ ద్వారా విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెంపొందడంతో పాటు చక్కటి ఆలోచనా విధానం అలవడుతుందని గుర్తుచేశారు. క్రీడల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నామని, అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే విద్యార్థులను వివిధ స్థాయిల పోటీలకు ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలలో మూడవ తరగతి అభ్యసిస్తున్న కే. స్నితిక్ రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్-13 జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని తన మొట్టమొదటి అంతర్జాతీయ ఫీడే రేటింగ్ సాధించడం ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ అభినందన సభలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతను అభినందించారు.

## కరీంనగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జన ఏర్పాట్లు.. కొత్తపల్లి నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు రోజు నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కొత్తపల్లి వినాయక నిమజ్జన స్థలాన్ని మేయర్ స్వయంగా సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రదేశంలో పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ వెలుగులు, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశమున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. భక్తుల సౌకర్యం, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు వాసల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్ మరియు ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తీవ్ర విమర్శలు




**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు నాలుగు వందల ఇరవై హామీలు, పదమూడు డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని, కానీ వెయ్యి రోజుల పాలన పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ విమర్శించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి, ప్రజలను మోసం చేసిన తీరుకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను మరిచిపోతే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని సతీష్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు గుర్తు చేస్తూ, ఒక్కో హామీ అమలు కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావచ్చునని, కానీ ప్రజల ప్రశ్నల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. నాలుగు వందల ఇరవై హామీలకు సమాధానం చెప్పాల్సిందేనని, ఆరు గ్యారెంటీల అమలు ఏమైందని, పదమూడు డిక్లరేషన్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల కష్టాలు, సమస్యలు, హక్కుల కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుండి పోరాడుతుందని సతీష్ కుమార్ పేర్కొన్నారు. ప్రతిపక్షంగా ప్రజల గొంతుకగా నిలబడి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని, ప్రతి బాకీ హామీని ప్రజల ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. మాట తప్పితే ప్రశ్నిస్తామని, హామీ అమలు కాకపోతే నిలదీస్తామని, ప్రజలకు అన్యాయం జరిగితే కొట్లాడుతామని, ప్రతి హామీ నెరవేరే వరకు సమరం ఆపేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో దారుణం



**తెలంగాణ అడ్డా సిరిసిల్ల బ్యూరో:** ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో భార్య పల్లపు జ్యోతి (రజిత) ని కత్తులతో పొడిచి చంపిన భర్త పల్లపు సురేష్. భార్య గొంతు, కడుపు, చేతులపై విచక్షణారహితంగా పొడిచి హతమార్చిన వైనం.. దాడిని అడ్డుబోయిన అత్త గండికోట ఎల్లవ్వపై కూడా కత్తితో దాడితో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలును సిరిసిల్ల ఆసుపత్రికి తరలింపు... కుటుంబ కలహాలే ఈ హత్యకు దారితీసినట్లు అనుమానం... ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

EDITOR, PUBLISHER, OWNER BYGADDI NARESH Published at D.No: 3-82, Rathnampeta, Vilasagar, Rajanna Sirisilla, Karimnagar District, Telangana State pin—505524. Printer Sanam Venkata Rajasekhar, Printed at Arunodaya Printers D.No : 33-5-9, 2nd floor, , Papaiah Street, Seetharamapuram , Vijayawada, Krishna District, Andhra Pradesh pin-52002 Email Telanganadhairyamnewspaper@gmail.com, Cell :9441260616. RNI No: TGTEL/25/A0986